
నామినేటెడ్ ఆశలు

- త్వరలో భర్తీ చేస్తారనే సంకేతాలు
- ఉమ్మడి జిల్లాలో భారీగా ఆశావహులు
- కీలక నాయకుల వైపే అందరిచూపు
- రాష్ట్ర కార్పొరేషన్, జిల్లా స్థాయి పదవులకు డిమాండ్



మహబూబ్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ నాయకుల్లో నామినేటెడ్ పదవుల పై ఆశలు రేకెత్తుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన తర్వాత వీలైనంత త్వరగా ఈ పదవులు భర్తీ చేస్తారనే సంకేతాలతో ఆశావహులలో సందడి మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల సమయం లో ఎమ్మెల్యే సీట్లకు చివరి వరకు పోటీపడ్డ నాయ కులు, పార్టీ అధికారంలో లేకపోయినా దశాబ్ద కాలంగా జిల్లాల్లో పార్టీకి విధేయులుగా ఉన్న నాయ కులు, ఎన్నికల సమయంలో ఇతర సందర్భాల్లో అధిష్ఠాన ముఖ్యుల నుంచి భరోసా పొందిన నాయకులు ఈ పదవులు తమకు దక్కుతాయనే విశ్వాసంతో ఉన్నారు. ఎమ్మెల్సీలు, రాష్ట్ర కార్పొ రేషన్ చైర్మన్, డైరెక్టర్ పదవులతో పాటు జిల్లా స్థాయిల్లో ఉండే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, గ్రంథాలయ సంస్థల చైర్మన్ల పదవులకు కీలక నాయ కుల పేర్లను పరిశీలిస్తున్నట్లు పార్టీవర్గాల్లో చర్చ సాగుతోంది.

కార్పొరేషన్ పదువులపై పలువురి ఆశలు..

పాలమూరు ఉమ్మడి జిల్లాలో కార్పొరేషన్ చైర్మన్ల పదవులను ఆశించే నాయకులు కూడా పెద్ద సంఖ్యలోనే ఉండడంతో ఎవరికి అవకాశం దక్క బోతోందనే అంశంపై రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోం ది. పదేళ్లుగా పార్టీకి విధేయులుగా ఉండడం, ప్రతికూల పరిస్థితుల్లో పార్టీనే నమ్ముకొని ఉండడంతో పాటు, అసెంబ్లీ ఎన్నికల్లో అధిష్ఠానం టిక్కెట్ ఇవ్వకపోయినా పార్టీ అభ్యర్థుల కోసం పనిచేసిన నాయకులంతా కార్పొరేషన్ పదవులు దక్కుతాయనే ఆశల్లో ఉన్నారు. మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పీసీసీ ప్రధాన కార్యదర్శులు ఎస్పీ వినోద్‌కుమార్, సంజీవ్‌ముదిరాజ్, ఎన్‌పీవెంకటేశ్, సురేందర్‌రెడ్డి, ముని సిపల్ మాజీ చైర్‌పర్సన్ రాధాఅమర్, జేపీసీ మాజీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షు రాలు బెక్కరి అనితారెడ్డి పార్టీ నుంచి అవకాశం దక్కు తుందనే విశ్వాసంలో ఉన్నారు. జడ్చర్ల నియోజక వర్గం నుంచి మైనార్టీ నాయకులు ఎండీ రబ్బానీ, జహీర్ అక్తర్‌తో పాటు మాజీ ఎంపీపీ నిత్యానందం అధిష్ఠానం కరుణ చూపుతుందనే నమ్మకంతో ఉన్నారు. దేవరకద్ర నియోజకవర్గం నుంచి రాచాల యుగంధర్‌గౌడ్, అరవింద్ కుమార్ రెడ్డి సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తున్నారు. మక్తల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి తనయుడు కె.ప్రశాంత్ కు మార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దయాకర్ రెడ్డి తనయుడు కె.సిద్ధార్థ్‌రెడ్డికి ఎన్ని కల సమయంలో అధిష్ఠానం హామీ ఇచ్చిన నేపథ్యంలో ఈ నాయకులకు నామినేటెడ్ పోస్టులు దక్కడం ఖా యమనే చర్చ సాగుతోంది. మరో వైపు ఇదే నియోజకవర్గానికి చెందిన సీఎం అనుచరుడి గా పేరున్న బీసీ నాయకు డు నాగరాజుగౌడ్, ఆంజ నేయులు గౌడ్ నామి నేటెడ్ పదవి వరి స్తుందని భావి స్తున్నారు. నారా యణపేట నియోజక వర్గం లో పార్టీ నియో జకవర్గ ఇన్ చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి తనకు నామినే టెడ్‌పదవి ఇవ్వా లని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు సమాచారం. కొడంగల్ నియో జకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత నమ్మకస్తుడిగా, ప్రతీ ఎన్నికల్లో ఆయన విజయం కోసం శ్రమిస్తారనే పేరున్న గిరిజన నాయకుడు దేవులా నాయక్‌కు సీఎం తప్పకుండా నామినేటెట్ పదవి ఇస్తారని నియోజకవర్గంలో, ఆ సా మాజిక వర్గంలో చర్చ సాగుతోంది. గద్వాల నియోజక వర్గంలో జడ్పీ చైర్‌పర్సన్ సరితకు మహిళా కోటాలో ఏదైనా నామినేటెడ్‌పోస్టు దక్కుతుందనే చర్చ సాగు తుంటే, కీలకనేత చంద్రశేఖర్‌రెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ఏఐసీసీ బీసీసెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కేతూరి వెంకటేశ్, సీఆర్ జగదీశ్వర్‌రావు, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి నామినేటెడ్ బరిలో ఉన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి, జడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. అచ్చంపేట నియోజక వర్గానికి చెందిన ఓయూ విద్యార్థినేత డాక్టర్ చారగొండ వెంకటేశ్‌కు కూడా కీలక పదవి దక్కుతుందనే చర్చ సాగుతోంది. సీఎం సొంత జిల్లా కావడం, ఆశావహులు పెద్దసంఖ్యలో ఉండడంతో ఏ ప్రాతిపదికన ఎవరికి అవకాశం దక్కుతుంది..? అవకాశమివ్వలేకపోయిన వారిని ఎలా సర్దుబాటు చేస్తారనే అంశం మున్ముందు తేలనుంది.

మాజీలపైనే అందరిచూపు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికలలో పోటీకి అవకాశం దక్కకపోయినా అధిష్ఠానం సూచనల మేరకు అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన ముఖ్య నాయకులకు ఏ పదవులు దక్కబోతున్నాయనే అంశంపైనే అంద రి దృష్టి నెలకొంది. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా స్థాయి నాయకులు ఈ జాబితాలో ఉండడంతో వీరి స్థాయికి తగ్గ పదవులు ఎలా సర్దుబాటు చేస్తారనే అంశం ఆసక్తి రేపుతోంది. వనపర్తిలో చివరి నిమిషంలో పోటీ నుంచి తప్పుకొన్న మాజీ మంత్రి డాక్టర్ చిన్నారెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ మందా జగ న్నాథ్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సంపత్ కుమార్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ సేనారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి, పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహాం వంటి ముఖ్య నాయకులు ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

- టీఎస్ ఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ జే శ్రీనివాసరెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి

పాలమూరు, జనవరి 19: టీఎస్ ఎస్‌పీడీసీఎల్ సంస్థలో సీజీఎం నుంచి ఏఈ వరకు అందరూ బాధ్యతగా పనిచేయాల్సిందేనని టీఎస్ ఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ జే శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్ లో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా విద్యుత్ అధికారులతో ఏర్పాటు చేసిన నెల వారీ సమీక్షకు పలువురు డైరెక్టర్లతో కలిసి ఆయన హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటిసారిగా అధికారులతో సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ ఉద్యోగులు సంస్థకు మేలు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నా రు. ఉద్యోగులు తీసుకునే వేతనానికి న్యాయం చేసినప్పుడే సార్థకత లభిస్తుంద న్నారు. విద్యుత్ సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా, బాధ్యతగా పనిచేసేందుకు ఉదయం 9 గంటలకే ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో సీజీఎం భిక్షపతి, డైరెక్టర్ కమర్షియల్ రాములు, డైరెక్టర్ పీఅండ్ఎంఎం మధన్ మోహన్‌రావు, డైరెక్టర్ ఎనర్జీ ఆడిట్ గోవర్ధన్, ఎస్ఈలు ఎన్ఎస్ఆర్ మూర్తి, నారాయణపేట ఎస్ఈ ప్రభాకర్, గద్వాల ఎస్ఈ భాస్కర్, వనపర్తి ఎస్ఈ నాగేందర్, డీఈటీ బీ చక్రవర్తి, డీఈలు శివరామకృష్ణ, ఏడీలు, ఏఈలు ఉన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత మహబూబ్‌నగర్



విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

గట్టు, జనవరి 19: శివ వీరాంజనేయ జాతర సందర్భంగా బీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ వాలీబాల్ టోర్నీలో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని ఆరగిద్ద గ్రామంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 15 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ విజేతకు రూ.30 వేలతో పాటు ట్రోఫీని అందించా రు. హైదరాబాద్ జట్టు ద్వితీయ స్థానంలో నిలవగా, రూ.20 వేలు, ట్రోఫీని బహూకరించారు. మూడవ స్థానాన్ని దక్కించుకున్న రాయచూరు జట్టుకు రూ. 10 వేల నగదును అందించారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు బాసు శ్యామల, సర్పంచ్ పటేల్ యోగీశ్వరిల సౌజన్యంతో నగదు బహుమతులను పీఏసీఎస్ చైర్మన్ క్యామ వెంకటేష్, మధుసూదన్‌రెడ్డి విజేతల కు అందించారు. ట్రోఫీలను పటేల్ చెన్నారెడ్డి, రమేష్, వీరేష్‌కుమార్ ఇచ్చారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే..
రాష్ట్రంలో అభివృద్ధి



ప్రతిజ్ఞ చేస్తున్న కేంద్ర మంత్రి డాక్టర్ మహేంద్ర నాథ్ పాండే, అధికారులు

- సల్కర్‌పేట మీదుగా త్వరలోనే రైల్వేలైన్ నిర్మాణం
- రూ.1.2 లక్షల కోట్లతో రాష్ట్రంలో హైవేల అభివృద్ధి
- ఇల్లులేని ప్రతీ నిరుపేదకు పక్కా ఇల్లు నిర్మిస్తాం
- వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ మహేంద్రనాథ్ పాండే

బిజినేపల్లి/కల్వకుర్తి, జనవరి 19 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతోనే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని కేంద్ర ప్రభుత్వ భారీ పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ మహేంద్రనాథ్ పాండే అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని సల్కేర్‌పేట గ్రామంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే యశస్సు, తేజస్సు ఉన్న ప్రధానమంత్రి మోదీతోనే సాధ్యమవుతుందన్నా రు. నిరుపేద రైతులకు పెట్టుబడి సాయంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఏడాదికి రూ.6 వేల ఆర్థిక సాయం, ఉజ్వల యోజన పథకం ద్వారా ఇంటింటికి గ్యాస్ కనెక్షన్లు, జన్‌ధన్ ఖాతాలు, స్వచ్ఛ భారత్ పథకం ద్వారా ఇంటింటికి మరుగుదొడ్డి నిర్మాణం, ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు, కరోనా కాలం నుంచి ఉచితంగా రేషన్ పంపిణీ అంది స్తున్నది కేంద్ర ప్రభుత్వమని ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగా హన కల్పించేందుకు గ్రామ గ్రామానికి మోదీ గ్యారంటీ వాలీ వాహనం వస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ రహదారుల అభివృద్ధికి, నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి రూ.1.2 లక్షల కోట్లు విడుదల చేశామన్నారు. రాబోయే రోజుల్లో నంద్యాల నుంచి నాగర్‌కర్నూల్, సల్కేర్ పేట మీదుగా నూతన రైల్వేలైన్ నిర్మాణం ప్రారంభిం చనున్నట్లు తెలిపారు. రైల్వేలైన్ పూర్తైతే ఈ ప్రాంతంలో అభివృద్ధి శరవేగంగా సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రతీ పేదవాడికి పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. ప్రతీ ఆవాసానికి విద్యుత్ సౌకర్యంతో పాటు సడక్‌యోజన పథకం ద్వారా ప్రతీ గ్రామానికి బీటీ రోడ్డు వేస్తామన్నారు. 2047 వరకు భారత దేశంలోని ప్రతీ మూలకు అభివృద్ధి పథకాలు అందించి నిరుపేదలను లక్షా ధికారులుగా మార్చడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమని అన్నారు. అందుకు తెలంగాణలోని ప్రజలంతా మోదీ వెంట నడవాలని కోరారు. అనంతరం మహిళా సంఘాలకు రూ.2.85 కోట్ల రుణాల చెక్కును అందజేశారు. అంతకు ముందు నిర్వహించిన గిరిజన మహిళల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అదేవిధంగా కల్వకుర్తి సమీపంలోని అక్షరవనాన్ని కలెక్టర్ ఉదయ్‌కుమార్, అక్షరవనం నిర్వాహకులు శ్రీపతిరెడ్డితో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దిలీపాచారి, జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు, కేంద్ర మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ రాజుకుమార్ మిశ్రా, అదనపు కలెక్టర్ దీపక్ కుమార్, నాబార్డు డీడీఎం అఖిల్, ఎల్‌డీఎం కౌశల్ కిషోర్ పాండే, డీఆర్‌డీవో నరసింగ రావు, డీఎంహెచ్‌వో సుధాక ర్ లాల్, డీఏవో వెంకటేశ్వ ర్లు, తహసీల్దారు శ్రీరాములు, సర్పంచ్ చంద్రకళ పాల్గొన్నారు.

ప్రజాభిమానంతోనే
అధికారంలోకి వచ్చాం

- బీజేపీ రామ రాజకీయం ఆపాలి
- నవాబ్‌పేట పర్యటనలో మంత్రి పొన్నం ప్రభాకర్

నవాబ్‌పేట, జనవరి 19: ప్రజా భిమానంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన 45 రోజులలోనే ఇచ్చిన హామీలు అమలు చేయాలని, 420 పార్టీ అని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించడం సరికాదన్నారు. శుక్రవారం మండలంలోని కొల్లూర్‌లో ఏర్పాటు చేసిన చింతలపూరి మఠం నిత్యపూజ రజతోత్సవం, గ్రామ ముఖద్వారం కార్యక్రమానికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనపై ప్రజలు విసుగు చెంది కాంగ్రెస్ పాలన కోరుకున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి నెలన్నర రోజులు మాత్రమే అయ్యిందని అన్నారు. అప్పుడే హామీల అమలు ఏమైందని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయని అన్నారు. తాము గ్రామాల్లోకి వస్తే కొంతమంది మండలం ఎప్పుడు అయితది, గ్రామాలకు రహదారులు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ప్రశ్నిస్తున్నా రన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇలా ప్రశ్నించి ఉంటే బాగుండేదని, తమ పార్టీకి కొంత సమయం ఇవ్వాలని ఆయన అన్నారు. మొన్న నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజల నుంచి రూ.1.05కోట్ల దరఖాస్తులు వచ్చాయన్నారు. సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ఆదేశానుసారం మంత్రివర్గం ఏర్పాటు చేసి మండలం ఏర్పాటు, రహదారుల మరమ్మతులు చేయిస్తామన్నారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతా వరణం పెంపొందించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం కరోనా కాలం నుంచి మా గ్రామాలకు ఆర్టీసీ బస్సు రవాణా సౌకర్యం నిలిపి వేశారని, మళ్లీ మా గ్రా మాలకు బస్సు సౌకర్య కల్పించాలని కోరుతూ మండల ప్రజలు మంత్రికి వినతిపత్రం అందిం చారు. శ్రీశైల పీఠాధిపతి చెన్న సిద్దరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి ప్రవచనాలు చేశారు. అనంతరం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అయోధ్య రాములోరి అక్షింతల పేరుతో ఊరూరా బియ్యం సంచులు ఇచ్చి బీజేపీ నాయకులు రామరాజకీయం చేస్తున్నారని విమర్శించారు. రామాలయ ప్రారంభోత్సవాన్ని స్వయా న పీఠాధిపతులే వ్యతిరేకించారని, తాము వ్యతిరేకిం చడంతో పెద్ద ఆశ్చర్యం లేదన్నారు. ఆరు నెలల్లో రాష్ట్రంలో తిరుగు బాటు వస్తుందని బీఆర్ఎస్ నాయ కులు చెప్పడం హాస్యాస్పదమని, తిరుగుబాటు మరో ఆరు సార్లు వచ్చినా తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చింతలపూరి చిన్నయ్య స్వామి పీఠాధిపతి నందీశ్వర స్వామి, డీసీసీ మాజీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి జహీ ర్ అక్తర్, నీరటి రాంచెంద్రయ్య, బంగ్ల రవి, సర్పంచ్ సౌజన్య, ఆళ్ల భూపాల్ రెడ్డి, యూత్ కాంగ్రె స్ జిల్లా అధ్యక్షుడు వాసుయాదవ్, మండల అధ్యక్షు డు నీరటి రాంచెంద్రయ్య, తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భూదందాలపై
విచారణ షురూ

- ఆ మూడెకరాలపై ప్రత్యేక దృష్టి
- నెల్లికొండ ఆంజనేయస్వామి భూములపై విచారణ చేపట్టాలి
- రెవెన్యూ అధికారులకు సూచించిన ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా లో పదేళ్ల కాలం నుంచి జరిగిన భూదందాలపై విచారణ మొదలైంది. క్షేత్రస్థాయిలో అన్ని అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించాలని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి అభ్యర్థన మేరకు కలెక్టర్ ప్రత్యేక విచారణకు ఆదేశించారు. నాగర్‌కర్నూల్‌లోని కొల్లాపూర్ చౌరస్తాలో ఒక ప్రైవేట్ ఆస్పత్రి ఎదురుగా మూడెకరాల భూమిని ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు సొంతం చేసుకుని కోట్లు దండుకునే విషయం ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. ఈ మూడెకరాల్లో కౌలుదారు ఉన్నప్పటికీ నాలా అనుమతులు ఎలా వచ్చాయి, డీటీసీపీ లే అవుట్ ఎలా వచ్చిందనే అంశంపై విచారణ జరుగుతోంది. నెల్లికొండ ఆంజనేయస్వామి మాన్యానికి సంబంధించిన భూముల విషయంలో కూడా పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన క్రమంలో ఈ భూ వ్యవహారంపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు వెళ్లాయి. ఇక్కడ దాదాపు 26 ఎకరాల మాన్యం భూములను ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమ్ముకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తుమ్మల కుంటను కూడా ఆక్రమించుకున్నారని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో భూ ఉదంతం కూడా వెలుగులోకి వచ్చింది. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఒక లావణి పట్టా భూమిలో ఫంక్షన్‌హాల్ నిర్మించడం వివాదాస్పదంగా మారింది. నాగర్‌కర్నూల్‌లో కోటీశ్వరుడైన ఓ వ్యక్తి దేశిటిక్యాలకు చెందిన ఒకరి నుంచి లావణి పట్టా భూమిని కొనుగోలు చేసి ఆయన భార్య పేరు మీద మార్చుకోవడం వెనక పెద్ద తతంగమే నడిచినట్లు సమాచారం. లావణి పట్టాను ప్రభుత్వం ఎప్పుడైనా తిరిగి తీసుకునే అవకాశాలున్న ప్పటికీ అక్కడ ఫంక్షన్ హాల్ వెలియడం రెవెన్యూ అధికారుల అవినీతికి పరాకాష్టగా కన్పిస్తోంది. వనపట్ల రైతు చైతన్య వేదిక సమీపంలో కూడా ప్రభుత్వ భూమి దురాక్రమణకు గురి కావడం తాజాగా వెలుగులోకి వచ్చింది. అధికారుల అండదండలతో రోడ్డును కూడా ఆక్రమించడం హాట్‌టాపిక్‌గా మారింది. నాగర్‌కర్నూల్‌లో ఇన్ని భూఆక్రమణలు జరిగినప్పటికీ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారు లకు వత్తాసు పలికే విధంగా మౌనం దాల్చడం విమర్శలకు దారి తీస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కేసరి సముద్రం చెరువును దురాక్రమణ చేసి విలాసవంతమైన భవనాలు నిర్మించినా మిన్న కుండిపోవడం ప్రధానంగా చర్చకు వస్తోంది. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి 15 రోజుల్లో భూ దురాక్రమణలపై సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించినట్లు సమాచారం. నాగనూల్ సమీపం లోని పుట్నాలకుంట విషయంలో కూడా ప్రత్యేక విచారణ జరగనుంది. శిఖం భూమి దురాక్రమణపై కూడా అధికారులు విచారణ చేపట్టారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, జనవరి 19: జిల్లాలో బాల్య వివాహాలను ప్రతీ ఒక్కరు నిర్మూలించాలని నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో స్త్రీ శిశువు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని బేటి బచావో బేటి పడావో సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో బాల్యవివాహాలు నిర్మూలించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. 18ఏళ్ల దాటాక వివా హం జరిపించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్పీ మాట్లాడు తూ బాల్యవివాహాలు చేస్తే పూజారిలపై కేసులు తప్పవని, గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు పరిశీలించాలని సూచించారు. అ నంతరం ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో అదన పు కలెక్టర్ మయాంక్ మిట్టల్, ఆర్డీవో రాంచం దర్, డీడబ్ల్యూ వేణుగోపాల్, అధికారులు పా ల్గొన్నారు.

కఠిన చర్యలు తప్పవు..

విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీహర్ష హెచ్చరించారు. జిల్లా లోని మాగనూర్ పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు వైద్యులను టర్మినెట్ చేస్తూ ఒక ఏఎన్ఎం, ఒక సీహెచ్‌వోను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ శ్రీహర్ష ఓ ప్రకటనలో తెలి పారు. టెర్మినెట్ అయిన వారిలో వైద్యులు రాజేష్, నాగరత్నం కృష్ణ, నరేష్, సస్పెండ్ చేసిన వారిలో యాదమ్మ, సాయిబాబు ఉన్నారు.

ఓటరు నమోదు పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

ఓటరు నమోదు పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని, జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సంబంధిత అధికారులతో కలిసి ఓటరు నమోదు కార్యక్రమం, పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం తదితర అంశాలపై జిల్లా కలె క్టర్లకు సూచనలు చేశారు.

అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. జిల్లాలో పెండింగ్‌లోని ఓటరు దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాల న్నారు. జనవరి 6, 2024న విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబి తాపై ప్రజల నుంచి జనవరి 22, 2024 వరకు అభ్యంతరాలు స్వీకరిం చాలని, వచ్చేనెల 2న అభ్యంతరాలు పరిష్కరించాలని, ఫిబ్రవరి 8 నాటికి తుది ఓటరు జాబితా రూపొందించాలని తెలిపారు. 20, 21 తేదిల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో బీ ఎల్ఓలు పోలింగ్ కేంద్రాలవద్ద అందుబాటులో ఉండి ఓటు హక్కు లేనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిం చాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మయాంక్ మిట్టల్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఊడిన బస్సు టైరు

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెనుముప్పు



ముందు చక్రం ఊడిపోవడంతో రోడ్డుపై నిలిచిపోయిన ఓల్వో బస్సు

అడ్డాకుల, జనవరి 19 : బస్సు డ్రైవర్ అప్రమత్తతతో ఓల్వో బస్సుకు పెనుప్రమాదం తప్పిన సంఘటన శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల వద్ద గల 44వ నెంబర్ జాతీయ రహదారిపై జరిగింది. స్థానికులు, డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు గురువారం సాయంత్రం 35 మంది ప్రయాణికులతో ప్రైవేటు సీఎంఆర్ ఓల్వో బస్సు బయలుదేరింది. అడ్డాకుల మండల పరిధిలోని కాటవరం స్టేజీ దగ్గర గల 44వ నెంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం బస్సు రన్నింగ్‌లో ఉండగానే పెద్ద శబ్దంతో ముందరి టైరు ఊడిపోయింది. దీంతో ఒక్కసారిగా రోడ్డు రాపిడితో మంటలు వచ్చాయి. బస్సు కొద్ది దూరం ముందుకు వెళ్లింది. డ్రైవర్ చాకచక్యంతో బస్సును అదుపులోకి తెచ్చి నిలిపివేశాడు, ప్రయాణికులను దించేసి ఫైర్‌గన్‌తో మంటలను ఆర్పేశాడు. ఈ పరిణామంతో హడలెత్తిపోయిన ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా స్థానికులు, టోల్‌గేట్ సిబ్బంది, పోలీసులు వచ్చి ప్రయాణికులకు ధైర్యం చెప్పారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కాగా 2013 అక్టోబరు 30న పాలెం దగ్గర బస్సు దగ్ధమైన 44 మంది చనిపోయిన సంఘటన ఇప్పటికీ అందరికీ వెన్నులో వణుకు పుట్టిస్తోంది. ఓల్వో బస్సులు వేగ నియంత్రణ పాటించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వరిలో అధునాతన వంగడాలు సాగు చేయాలి

» ఐసీఏఆర్, ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్త డాక్టర్ ఏవీఎస్ఆర్ స్వామి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

రేవల్లి, జనవరి 19 : మనం తింటున్న అన్నంలో జింక్, ఐరన్ ప్రొటీన్లు లేకపోవడం వల్ల మనిషి ఎదుగుదలలో అనేక వ్యాధులు వస్తున్నాయని ప్రపంచానికి అన్నం పెట్టే రైతన్న అవగాహనతో సేద్యం చేస్తే రోగాల నుంచి బయటపడవచ్చని ఐసీఏఆర్, ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్త డాక్టర్ ఏవీఎస్ఆర్ స్వామి రైతులకు సూచించారు. శుక్రవారం వనపర్తి జిల్లా చెన్నారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జాతీయ వరి పరిశోధన సంస్థ సైంటిస్టులు డాక్టర్ ఏవీఎస్ఆర్ స్వామి, డాక్టర్ సీఎన్ నీరజ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రాజేందర్‌రెడ్డి, అనిత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన అవగాహన కల్పిస్తే రైతులు వరిలో వంగడాల ఎంపికలో తొందరపడకుండా సాంప్రదాయ పద్ధతిలో మేలు జాతి కొత్త విత్తనాలు ఎంచుకుంటారని వారు తెలిపారు. మాలాంటి ప్రభుత్వ పరిశోధన సంస్థ ఒక్కో కొత్త విత్తనాలు కనిపెట్టడానికి 12 సంవత్సరాల సమయం పడుతుందని అన్నారు. జాతీయ వరి పరిశోధన కేంద్రంలో 75 రకాలు వరి వంగడాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ విషయాలపై రైతులకు అవగాహన లేకపోవడం వల్ల కేవలం రెండు మూడు రకాలే వాడుతున్నారని వాటిలో కూడా యాజమాన్య పద్ధతులు తెలియక నష్టపోతున్నారని అన్నారు. ఈ మధ్యకాలంలో డీఆర్ఆర్ 48, 52, 53 రకాలకు మార్కెట్లో ఎక్కువ డిమాండ్ ఉందని వీటిలో జింక్, ఐరన్ ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయని వీటివల్ల బాలింతలు, చిన్నారులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. అనంతరం జడ్పీ సీఈవో రామ్‌మహేశ్వర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జీపీడీపీ ప్రోగ్రామ్స్ అనుసరించి గ్రామ స్థాయిలో గ్రామ అభివృద్ధికి బడ్జెట్ ఎలా నిర్వహించాలో సూచనలు, సలహాలు చేశారు. అనంతరం శాస్త్రవేత్తలు అంగన్‌వాడీ కేంద్రాలకు పోషక విలువలు కలిగిన బియ్యం, బ్యాగులు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు వల్లమ్మ, పంచాయతీ కార్యదర్శి బాలరాజు, వ్యవసాయ విస్తరణ అధికారి ఫిరోజ్, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర క్షేత్రంలో ఉత్సవర్లకు శేషవాహన సేవ

- రంగు రంగుల పూలతో
అమ్మవారికి అలంకరణ

అచ్చంపేటఅర్బన్, జనవరి 19: ఉమామహేశ్వర క్షేత్రంలో శుక్రవారం స్వామివారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. ఉమామహేశ్వరం క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి హైదరాబాద్, నల్గొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్, దేవరకొండ తదితర ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు ఉమామహేశ్వరున్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొంతమంది భక్తులు భోగమహేశ్వరం నుంచి మెట్ల మార్గం ద్వారా కొండ పైకి చేరుకుని ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఉమామహేశ్వర ఆలయంలో భక్తులు బారులు తీరారు. శుక్రవారం ఉదయం స్వామి, అమ్మవార్లను శేషవాహన సేవలో ఊరేగింపుగా ఆలయం నుంచి పాపనాశిని గుండం వరకు పల్లకిలో తీసుకెళ్లి అక్కడ స్వామివారికి గుండంలోని గంగాజలంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం ధ్వజస్తంభం గర్భగుడి వరకు వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉదయం 9 గంటలకు గవ్యాంత పూజలు, రుద్రాభిషేకం, రుద్రహోమం, అవాహిత దేవతా హోమాలు, మూర్తిహోమం, శేషవాహనం, పూర్ణాహుతి, వసంతోత్సవం, త్రిశూల స్నానం, ధ్వజావరోహనం, పుష్పోత్సవం, ఏకాంతసేవ, మహదాశీర్వాయనం, పండిత సత్కారం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ఛైర్మన్ కందూరి సుధాకర్ చర్యలు తీసుకున్నారు. వాహనాలను కొండ దిగువన ఉన్న భోగమహేశ్వరం వద్దనే నిలిపివేశారు. అచ్చంపేట సీఐ అనుదీప్ ఆధ్వరంలో ఎస్సై గోవర్దన్ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.


ఆలయం అవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉత్సవమూర్తులకు వేదపండితుల పూజలు


జనసంద్రంగా మారిన రంగాపూర్ జాతర

నిరంజన్ షావలీ దర్గాకు పోటెత్తిన భక్తులు

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం రంగాపూర్ నిరంజన్ షావలీ దర్గాకు శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో జనసందోహంగా మారింది. ఉర్సుకు వచ్చిన భక్తులు ముందుగా ఉమామహేశ్వరుని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి అనంతరం రంగాపూర్ దర్గాలో కందూర్లు నిర్వహించి నిరంజన్ షావలీకి నైవేద్యాలు సమర్పించారు. ఉర్సు జాతరలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అచ్చంపేట సీఐ అనుదీప్ ఆధ్వరంలో ఎస్సై గోవర్దన్ ఆధ్వర్యంలో దాదాపు 50మంది పోలీసుల ద్వారా బందోబస్తును ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చిన భక్తులు తాగునీరు లేక నానా ఇబ్బందులు పడ్డారు.

పెన్సిల్ లెడ్స్‌తో అయోధ్య రామ మందిరం

- 48 గంటలలో 30 పెన్సిల్ లెడ్స్‌తో తయారీ

జడ్చర్ల, జనవరి 19 : ఈ నెల 22న అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా పెన్సిల్ లెడ్స్‌తో అయోధ్య రామ మందిరాన్ని జడ్చర్ల పట్టణానికి చెందిన సంతోష్‌చారి తయారు చేశారు. సుమారు 48గంటల పాటు ఉపవాస దీక్షతో పెన్సిల్ లెడ్స్‌తో, 1 అంగులం పొడువు, 1.5 అంగులం వెడల్పు సైజులో అరచేతిలో ఇమిడిపోయే నమూనాతో తయారు చేసారు. మందిరం నిర్మాణానికి సుమారు 30 పెన్సిల్ లెడ్స్‌ను వినియోగించినట్లు సంతోష్‌చారి తెలిపారు. విశ్వహిందు పరిషత్ పట్టణ అధ్యక్షుడిగా, రామ మందిరం నిర్మాణంకు నిధి సేకరణ చేయడంత పాటు అరచేతిలో పెన్సిల్ లెడ్స్‌తో రామ మందిరం నిర్మించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు సంతోష్‌చారి తెలిపారు.


సంతోష్‌చారి


పెన్సిల్ లెడ్స్‌తో నిర్మించిన అయోధ్య రామ మందిరం

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

చారకొండ, జనవరి 19: నాగర్‌కర్నూలు జిల్లా చారకొండ మండలంలోని కమాల్‌పూర్ వద్ద కోదాడ-జడ్చర్ల రహదారిపై జరిగిన ప్రమాదంలో నలుగురికి గాయాలు అయిన సంఘటన శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకొంది. ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన పుట్ట బాలరాజు, పుట్ట శిల్ప, పుల్కారం రాములమ్మ మండలంలోని గోకారం గ్రామానికి చెందిన మహమ్మద్ జూవేద్ తన కారులో ఆసుపత్రికి నాగర్‌కర్నూలుకు వెళ్తుండగా తెల్లవారుజామున కమాల్‌పూర్‌వద్ద కల్వకుర్తి నుంచి ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం అదుపుతప్పి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. ఎండీ జూవేద్ తన తండ్రి ఎండీ రషీద్‌కు విషయం తెలపడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని చికిత్సకోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం పుట్ట బాలరాజు, పుట్ట శిల్పను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రషీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

బాలానగర్, జనవరి 19 : ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని గౌతాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. గౌతాపూర్ గ్రామానికి చెందిన వడ్డే నర్సింహులు (42) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయారు. దీంతో నర్సింహులు తన చిన్ననాన్న శంకర్‌తో ఉంటూ కూలి పనులు చేసుకొని జీవిస్తున్నాడు. ఈ క్రమంలో అతను మూర్ఛ వ్యాధికిలోనై అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిన్నాన్న ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కృష్ణ, జనవరి 19: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని గుడెబల్లూరు గ్రామశివారులో 167వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఇటుక బట్టిలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన అంజప్ప, వెంకటమ్మ, వీరేష్ (22) ఇటుకల బట్టిలో పని చేస్తున్నారు. ఇటుకలు క్రేన్ ద్వారా బట్టిలోకి షిఫ్ట్ చేస్తుండగా 11 కేవీ వైర్లు క్రేన్‌కు తగలడంతో పక్కన ఉన్న వీరేష్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. దాంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. చేతికి వచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదన స్థానికులను సైతం కంటతడి పెట్టించింది. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' స్థానిక ఎస్సై విజయ్ భాస్కర్ వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

భూత్పూర్‌లో ఇద్దరు మహిళల అదృశ్యం

- కేసు నమోదు చేసిన పోలీసులు

భూత్పూర్, జనవరి 19 : మండలంలో వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు మహిళలు అదృశ్యమైన ఈ సంఘటనలకు సంబంధించి, ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెల్కిచర్ల గ్రామానికి చెందిన దేవరకొండ జ్యోతి(19) అనే మహిళ నెల 18వ తేదీన రాత్రి తల్లిదండ్రులతో ఇంట్లో నిద్రిస్తున్నది. మరునాడు తెల్లవారు జామున ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం దొరక లేదు. దీంతో మహిళ తండ్రి దేవరకొండ కుర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్‌ఐ తెలిపారు. అదే మాదిరిగా భూత్పూర్ మునిసిపాలిటీలోని అమిస్తాపూర్ గ్రామానికి చెందిన పసుపుల శిరీష(19) అనే మహిళ ఈ నెల 17వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఈమె సాయంత్రం వరకు తిరిగి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి ఇళ్లల్లో వెతికారు. ఆచుకీ లభించకపోవడంతో శిరీష తండ్రి పసుపుల చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం - కేసు నమోదు

వెల్దండ, జనవరి 19 : మండల పరిధిలోని కొట్ర గ్రామానికి చెందిన శ్యాంపూరి చంద్రయ్య (64) అనే వృద్ధుడు అదృశ్యం కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన చంద్రయ్య ఈ నెల 3న ఇంటినుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు వెదికినా ఫలితం లేకపోవడంతో ఆయన కుమారుడు చెన్నయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

దేవరకద్ర, జనవరి 19 : మండలంలోని గ్రామాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.శ్రీనివాసులు, ఎస్‌ఐ వెంకటేష్ అన్నారు. గురువారం రాత్రి వెంకటాయపల్లి గ్రామం నుంచి అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తరలిస్తున్నారన్ని తహసీల్దార్‌కు సమాచారం అందించగా ఆయన శుక్రవారం మండల పరిదిలోని వెంకటాయపల్లి గ్రామ సమీపం దగ్గర ఉన్న వాగును పరిశీలించారు. అక్కడ ఫిల్టర్ ఇసుక తయారుపై ఆయన విచారించారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకొని ట్రాక్టర్‌లను సీజ్ చేస్తామన్నారు. ఆయన వెంట ఉప తహసీల్దార్ శివరాజు, ఆర్‌ఐ సురేష్ తదితరులు ఉన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మహబుబ్‌నగర్ మండలం రాంచంద్రపూర్ గ్రామం నుంచి అక్రమంగా ఇసుకును టిప్పర్ ద్వారా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఉదయం రామచంద్రాపూర్ గ్రామం నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుకను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనుమతులు లేకుండాఎవరైన్న ఇసుకను తరలిస్తే కేసులు చేస్తామన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రాజోలి, జనవరి 19 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామం నుంచి శుక్రవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు రాజోలి ఎస్‌ఐ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్ద ధన్వాడ శివారులోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం వచ్చింది. దీంతో శుక్రవారం తెల్లవారుజామున పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహించగా, అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని, రాజోలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని, పెద్ద ధన్వాడ గ్రామానికి చెందిన లక్ష్మన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓటరు సవరణలో 20 వేల ఫారాలు పరిష్కారం

పాలమూరు, జనవరి 19 : మహబూబ్‌నగర్ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో నేటికి 45వేల ఫారాలను స్వీకరించగా సుమారు 20వేల ఫారాలను పరిష్కరించినట్లు జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్‌ఓలతో ఓటరు జాబితా సవరణ ఫారాలు, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఫారాల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ మాట్లాడుతు మూడు రోజుల్లో 20వేల ఫారాలను పరిష్కరించినట్లు తెలిపారు. ప్రాసెస్‌లో లేని వాటిని బీఎల్‌ఓలక ఉఅపంపించి వాటిని పూర్తి చేసామని, ప్రతిరోజు ఈ అంశంపై టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, ప్రత్యేక కలెక్టర్ నటరాజు, కలెక్టర్ కార్యాలయం ఏఓ శంకర్, ఆర్‌డీఓ కార్యాలయ డీఏఓ నానియా నాయక్, ఎలక్షన్ సెక్షన్ విభాగాధిపతులు, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ రాధాకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పదిలో వందశాతం ఫలితాలు సాధించాలి

● ప్రతీ విద్యార్థి ప్రత్యేక దృష్టి పెట్టాలి : డీఈవో

మహమ్మదాబాద్ జనవరి 19 : పదవ తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలని డీఈవో రవీందర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలో నంచర్ల, జూలపల్లి, మహమ్మదాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు పదో తరగతి కీలకం ఇష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన ప్రతీ అంశాన్ని విద్యార్థులు క్షుణ్ణంగా చదవాలని సూచించారు. నంచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన తరగతి గదులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో అధికారి వెంకటయ్య ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్, సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు .

గడ్డివాము దగ్ధం

రేవల్లి, జనవరి 19 : వనపర్తి జిల్లా రేవల్లి మండలం శానాయిపల్లి గ్రామంలో కౌలు రైతు కండె లక్ష్మయ్య పశువుల మేత కోసం వేసుకున్న గడ్డివాము ప్రమాదవశాత్తు దగ్ధమైంది. కౌలు రైతు కండె లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇతర రైతుల వద్ద నుంచి దాదాపు 15 ఎకరాల గడ్డిని కొని 450 కట్టలుగా కట్టించి పశువుల మేత కోసం తన ఇంటి దగ్గరే గడ్డివాము వేసుకున్నానని తెలిపాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లోని వారందరం పొలం పనులకు వెళ్లామని, మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుకుందని కట్టలుగా కట్టడం వల్ల పెద్దగా మంటలు చెలరేగలేదని అన్నారు. కాగా, ప్రమాదంలో వాముల పక్కనే ఉన్న ఐదు లేగదూడలు బతికి బయటపడ్డాయని పేర్కొన్నారు. పంటలు సరిగ్గా పండక ఇబ్బంది పడుతున్న సమయంలో పశువుల మేత అంటుకుపోవడం బాధ కలిగిస్తోందని వాపోయారు. సర్పంచ్ లక్ష్మి మాట్లాడుతూ విషయాన్ని తనకు గ్రామస్థులు ఫోన్‌లో వివరించగా, వెంటనే పంచాయతీ ట్రాక్టర్ సహాయంతో మంటలు ఆర్పుతూనే నాగర్‌కర్నూల్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించామని, వారు వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారన్నారు. తహసీల్దార్ లక్ష్మీదేవికి సమాచారం అందజేశామని, నష్టపోయిన రైతును ఏదో రకంగా ఆదుకోవాలని కోరినట్లు ఆమె తెలిపారు. ప్రమాదంలో దాదాపు లక్ష రూపాయల ఆస్తి నష్టం జరిగిందని సర్పంచ్ పేర్కొన్నారు.

అటవీ హక్కుల చట్టంపై చెంచులకు అవగాహన

లింగాల, జనవరి 19: అటవీ హక్కుల చట్టం 2006పై కర్ణాటక బృందం సభ్యులు శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని ఎర్రపెంటలోని చెంచులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బృందం సభ్యుడు జీఎం సింహం చట్టాన్ని ఎలా ఉపయోగించుకుంటున్నారు, అటవీ ప్రాంతంలోకి ఏ అనుమతితో వెళ్తున్నారు.. అటవీ హక్కు ప్రకారం చెంచులు తమ జీవనోపాధికై తేనె, పండు, చింతగింజలు, ఉసిరికాయలు సేకరించే తదితర విషయాలపై బృందం సభ్యులు చెంచులతో చర్చించారు. అటవీ హక్కుల పోరాట సమితి గ్రామ, మండల, డివిజన్, జిల్లా లెవల్‌లో ఫారెస్ట్ కమిటీలు ఉన్నాయని, ఈ కమిటీలు గిరిజనుల అభివృద్ధి కోసం పని చేస్తాయని ఆయన తెలిపారు. తమకు కొన్ని సందర్భాలలో తమ హక్కులను భంగం కల్గించేందుకు అటవీ శాఖ అధికారులు అడ్డగించినా తాము పోరాడి ఇళ్ల నిర్మాణాలకు స్థల ధ్రువీకరణ పత్రాలు, తహసీల్దార్‌తో పట్టా సర్టిఫికెట్లను పొందామని చెంచులు బృందం ముందు వాపోయారు. అదే విధంగా తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్యపరమైన తదితర సమస్యలను చెంచులు బృందం దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ సర్పంచ్ అక్కమ్మ, శ్రామిక వికాస కేంద్రం డైరెక్టర్ లక్ష్మణ్‌రావు, ఎఫ్‌ఆర్‌సీ కమిటీ ఛైర్మన్ గోవిందు, సభ్యులు నిరంజన్, ఈదన్న, ఏత్వరీ ఫౌండేషన్ ఫర్‌రూరల్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌యాదవ్, కర్నాటక బృందం సభ్యులు రత్నమ్మ, రజోబి, అప్పయ్య, ప్రకాష్, సురేష్, నాగరాజు, లోకేష్, గంగారాం, బసప్ప, రామన్న, సోషల్ వర్కర్ తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.


చెంచులకు అవగాహన కల్పిస్తున్న కర్ణాటక బృందం సభ్యులు

అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేయాలి

- ఢిల్లీకి చెందిన అమెరా ఏజెన్సీ బృందం తనిఖీ

మన్ననూర్, జనవరి 19: అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావంతో కృషి చేయాలని టైగర్ కన్సర్వేషన్ అథారిటీ(ఎన్‌టీసీఏ) అనుబంధ సంస్థ అయిన ఢిల్లీకి చెందిన అమెరా ఎజెన్సీ బృందం సభ్యులు అలోక్ కుమార్, యోగేష్‌లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతంలో చేపడుతున్న పులుల సంరక్షణ చర్యలను పరిశీలించేందుకు వారం రోజుల పర్యటన నిమిత్తం వారు ఏటీఆర్ పర్యటనకు వచ్చారు. మన్ననూరులోని పర్యావరణ విజ్ఞాన కేంద్రం అటవీ క్షేత్ర సంచాలకులు(ఎఫ్‌డీ) క్షితిజ, డీఎఫ్‌వో రోహిత్ గోపిడిలతో కలిసి ఏటీఆర్‌లో పనిచేసే రేంజ్, సెక్షన్, బీట్ అధికారులతో శుక్రవారం ఉదయం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నల్లమలలో వన్యప్రాణుల తాగునీటి వసతి, అగ్ని ప్రమాదాల నివారణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దుర్వాసుల చెరువు, తాటిగుండాల, దారవాగు బేస్ క్యాంపులకు వెళ్లి అక్కడి ప్రొటక్షన్ వాచర్లతో మాట్లాడారు. అమ్రాబాద్ ఎఫ్‌డీవో బత్తుల విశాల్, మద్దిమడుగు, మన్ననూరు, దోమలపెంట రేంజ్ అధికారులు ఆదిత్య, రవి కుమార్, గురుప్రసాద్ పాల్గొన్నారు.


మన్ననూరులో సమీక్ష నిర్వహిస్తున్న అలోక్ కుమార్, యోగేష్

పోలేపల్లి సెజ్‌లో కాలుష్యంపై అధికారుల బృందం పరిశీలన

- నీటి నమూనాల సేకరణ

జడ్చర్ల, జనవరి 19 : జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సెజ్‌లోని ఫార్మ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంపై శుక్రవారం అధికారుల బృందం పరిశీలించింది. జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఇండస్ట్రియల్ జోనల్ మేనేజర్ బాబురావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ విద్యుల్లత, టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్ రవి, ఏఈ కల్యాణి, గ్రౌండ్ వాటర్ శాఖ ఏఈ హరీష్, ఫిషరీస్ శాఖ అధికారి మదన్‌మోహన్‌ల బృందం పోలేపల్లి సెజ్‌లోని ఫార్మ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంపై పరిశీలనకు వచ్చారు. ప్రతీ నెల ఒక పర్యాయం సెజ్‌లో కాలుష్యంపై పరిశీలించాలన్న జిల్లా కలెక్టర్ రవినాయక్ ఆదేశాల మేరకు ఫార్మ పరిశ్రమలలో పరిశీలించారు. సెజ్‌లోని ఫార్మ పరిశ్రమల నుంచి రాత్రి వేళల్లో వెలువడుతున్న కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామంటూ టీఎస్‌ఐఐసీలోని ఓ విద్యాసంస్థలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లుగా తెలిసింది. ఫార్మ పరిశ్రమల నుంచి కాలుష్యం నీటిని బయటికి వదలడంతో సమీపంలోని పంటపొలాలు వ్యవసాయం చేసుకునేందుకు వీలుగా లేకుండ అయ్యాయని, నీటి కాలుష్యం అయ్యిందంటూ రైతుల ఫిర్యాదు మేరకు ఫార్మపరిశ్రమలను పరిశీలించినట్లు అధికారుల బృందం తెలిపారు. కాగా ఫార్మ పరిశ్రమల నుంచి నీటి నమూనాలను సేకరించామని, వాటికి ల్యాబ్‌కు పంపించనున్నట్లు పేర్కొన్నారు. సెజ్‌లోని ఓ ఫార్మ పరిశ్రమలో బోరును శాశ్వతంగా మూసివేయకుండ, దానిపై కట్టిన కట్టడంపై సదరు ఫార్మ పరిశ్రమ ప్రతినిధులను ప్రశ్నించినా, సరైన సమాధానాలు చెప్పకుండ తప్పించుకున్నట్లుగా తెలిసింది. పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం అంశంపై పరిశీలించామని, పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందచేయనున్నట్లు అధికారుల బృందం తెలిపారు.


సెజ్‌లో కాలుష్యంపై పరిశీలిస్తున్న అధికారులు

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 19: ఆర్థిక ఇబ్బందులతో ఉరి పెట్టుకుని వ్యక్తి ఎస్‌కే.గులాం(44) ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గలపల్లిలో చోటు చేసుకున్నట్లు రెండవ ఎస్‌ఐ రవీందర్‌జీ శుక్రవారం తెలిపారు. వివరాల ప్రకారం...

గగ్గలపల్లి గ్రామానికి చెందిన ఎస్‌కే గులాం నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్దకుమార్తె వివాహానికి చేసిన అప్పులు తీరక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం రాత్రి ఉరి పెట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై మృతుని భార్య పర్వీన్‌బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

- డీఎస్పీ వెంకటేశ్వర్లు
- పంచాయతీ కార్యదర్శిపై దాడి ఘటనలో విచారణ

వడ్డేపల్లి, జనవరి 19 : మండల పరిధిలోని రామాపురం గ్రామపంచాయతీ కార్యదర్శిపై దాడికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో గ్రామ పంచాయతీ లక్ష్మన్నపై గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు దాడి చేశారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ గ్రామానికి వెళ్లి విచారణ నిర్వహించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


రామాపురంలో విచారిస్తున్న గద్వాల డీఎస్పీ వెంకటేశ్వర్లు

కంకర పరిచారు.. బీటీ మరిచారు

- నరకం చూపిస్తున్న ఉంద్యాల రహదారి
- రెండున్నరేళ్లయినా ముందుకు సాగని పనులు
- బిల్లులురాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్

చిన్నచింతకుంట, జనవరి 19 : మండలంలోని ఉంద్యాల-చిన్నచింతకుంట రహదారి బీటీగా మార్చే పనులు ఎంతకూ ముందుకుసాగడం లేదు. ప్రధాన మంత్రి గ్రామ సడక్‌యోజన ద్వారా 2020-21కి సంబంధించి, పనులను 2021 అక్టోబరులో ఎంతో ఘనంగా ప్రారంభించారు. పనులు ప్రారంభించారు కానీ, బీటీ వేయటం మాత్రం మరిచారు. ఉంద్యాల గ్రామం నుంచి చిన్నచింతకుంట మండల కేంద్రం వరకు దాదాపు 5 కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు వేసేందుకు గానూ, రూ.3 కోట్ల 30లక్షల వ్యయంతో ప్రారంభించారు. కానీ, పనులను మాత్రం ప్రారంభించారు, కానీ పూర్తిచేయటంలో అటు కాంట్రాక్టర్, ఇటు అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కంకరవేసి ఏడాదిన్నర కావస్తున్నా, బీటీ మాత్రం వేయటం లేదని, దాంతో రోడ్డుపై ఇరు గ్రామాలకు రాకపోకలు కొనసా గించాలన్నా, కంకరతో తమ వాహనాలు అదుపుతప్పి బోల్తాపడుతున్నాయని, గాయాలపాల వుతున్నామని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిధులు రాకపోవటం తోనే సంబంధిత కాంట్రాక్టర్ బీటీ వేయకుండా చేతులెత్తేసారా అన్న అనుమానాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతినిత్యం మండల కేంద్రానికి వివిధ పనులపై వెళ్లాలన్నా, తేలిని కంకరతో, కాలుకూడా పెట్టలేని విధంగా రోడ్డు అంతా అస్తవ్యస్తంగా మారిందని, కనీసం రోడ్డును తవ్వి కంకర వేయకుండా ఉన్నా కనీసం నడిచేందుకు కొంత ప్రయోజనకరం గా ఉండేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇక ఉంద్యాల గ్రామంలో 300 మీటర్ల వరకు సీసీ వేయాల్సి ఉండగా, అదీనూ పెండింగ్‌లో ఉండ టంతో చినుకు పడితే చాలు, గ్రామంలోని రోడ్డు బురదమయంగా మారు తున్నదని స్థానికు లు వాపోతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నైనా పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఏఈఈ పీఆర్ సత్యకృష్ణను వివరణ కోరగా, త్వరలో పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


కంకరతేలిన ఉంద్యాల-చిన్నచింతకుంట రహదారి



సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దు :ఎస్పీ


ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట, జనవరి 19: సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ జిల్లా ప్రజలను కోరారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా ప్రజలను మోసం చేస్తున్నారని గుర్తు చేశారు. ఉన్నతస్థాయి అధికారుల వాట్సాప్ డీపీలను మార్చి కిందిస్థాయి ఉద్యోగుల నుంచి డబ్బులు పంపమని మేసెజ్ చేస్తున్నారని, ఆన్‌లైన్‌లో రుణాల గురించి మీ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసినప్పుడు వ్యక్తిగత వివరాలు యాప్ వారు అనుమతి లేకుండా తీసుకుంటారని, రుణాలకు ఎక్కువ మొత్తంలో డబ్బులు కట్టమని వేధింపులకు గురి చేస్తారని ఇలా యాప్స్ ద్వారా తీసుకునే రుణాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో పడితే వెంటనే 1930కి లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. మెయిల్ ఐడీ వంటివి ఇతరులకు ఇవ్వొద్దని, షాపింగ్ చేసే సమయంలో వ్యక్తిగత వివరాలు కూపన్ల ద్వారా ఇవ్వవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల గురించి పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

జడ్చర్ల ఇజ్తేమా సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



మద్దూర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న జామేమసీద్ కమిటీ సభ్యులు

మద్దూర్, జనవరి 19: జడ్చర్లలో ఈ నెల 27,28 తేదీల్లో నిర్వహించనున్న సున్నేషన్ బారా ఇజ్తేమా సదస్సు పోస్టర్‌ను మద్దూర్ జామే మసీద్ కమిటీ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండురోజుల పాటు నిర్వహించనున్న సున్నేషన్ బరా సదస్సుకు సున్నీ జామాత్‌గురువులు హాజరవుతారన్నారు. దైవసందేశం, ప్రార్థన, దువా తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఇజ్తెమాకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు హజిరాసాబ్, సయ్యద్ మూసలు, ఇమాంలు అబ్దుల్‌ఖాలిద్, ముజ్జమ్మిల్ , మౌజన్‌సలాం పాల్గొన్నారు.

కార్మికులు, కర్షకులు ఐక్యం కావాలి



సమావేశంలో పాల్గొన్న ఆయా సంఘాల నాయకులు

నారాయణపేట, జనవరి 19: కార్మికులు, కర్షకులు ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందని టీ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, రైతు సంఘం నాయకులు గోపాల్, బాల్‌రామ్, అంజిలయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సదస్సులో వారు మాట్లాడారు. దేశంలో 72కోట్ల మంది రైతులు, 50కోట్ల మంది శ్రామికులు ఉన్నారని వారి సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం కాపాడటం లేదని, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకు వచ్చి వ్యవసాయాన్ని బడా కంపెనీలకు అప్పగించేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. 44 కార్మిక చట్టాలను సవరించి నాల్గు కోడ్‌లుగా విభజించి కార్మికులను కట్టు బానిసలుగా మార్చే విధానాలు కేంద్ర ప్రభుత్వం అనుసరి స్తుందన్నారు. రైతులు, కార్మికులు ఏకమై 1982 జనవరి 19న మద్రాస్‌లో పోరాటం చేయగా తొమ్మిది మంది మృతి చెందారన్నారు. ప్రతీ సంవత్సరం జనవరి 19న వారిని స్మరించుకుంటూ కార్మిక కర్షక ఐక్యత దినాన్ని పాటిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మృతిచెందిన కార్మిక, కర్షకులను స్మరించుకుంటూ నివాళ్లు అర్పించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకుడు మహేష్ పాల్గొన్నారు.

క్షీరలింగేశ్వర స్వామి పుణ్యతిథి

కృష్ణ, జనవరి 19: మండల కేంద్రంలోని వెలిసిన సద్గురువు క్షీరలింగేశ్వరస్వామి 71వ పుణ్యతిథి పురస్కరించుకొని శుక్రవారం తెల్లవారుజామున స్వామివారికి రుద్రాభిషేకం, మూర్తిపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు సందర్శనార్థం అవకాశం కల్పించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు స్వాములను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం క్షీరలింగేశ్వరస్వామివారిని అడ్డపల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉదయకుమార్, వెంకటగౌడ, సిద్దప్పగౌడ, పోలీస్ పాటిల్, నీలకంఠయ్య తదితరులు పాల్గొన్నారు.

కిష్టాపూర్‌లో ఘనంగా యోగి వేమన జయంతి

ధన్వాడ, జనవరి 19: ధన్వాడ మండలం కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వేమన జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వేమన గురించి వివరించారు. వేలాది పద్యాలతో చాటిన సామాజిక చైతన్యకారుడిగా ప్రజల హృదయాల్లో వేమన సుస్థిర స్థానాన్ని సంపాదించారన్నారు. యోగి వేమన పద్యాలకు సంబంధించి పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాంచంద్రం, తెలుగు ఉపాధ్యాయుడు బాలయ్య, ఉపాధ్యాయులు సురేష్, వెంకట్రాములు, వెంకటేష్, రఘువీర్, మౌలాలి పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపికలు

మక్తల్, జనవరి 19 : నారాయణపేట జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న మధ్యాహ్నం 2 గంటలకు మక్తల్ సాయిజ్యోతి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బాలబాలికలకు జూనియర్స్ టెన్నికాయిట్(రింగ్‌బాల్) ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి దీప తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా స్థాయి ఎంపికలను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, యువజన క్రీడల అధికారి వెంకటేష్‌శెట్టి ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాస్థాయిలో క్రీడా నైపుణ్యత ప్రదర్శించిన బాలబాలికలను ఎంపిక చేసి ఈనెల 21న ఆదివారం హైదారాబాద్‌లో జరుగు రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు పంపిస్తామన్నారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు గోపాలం, కార్యదర్శులు రమేష్‌కుమార్, అంబ్రేష్, దామోదర్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఆర్థిక సాయం

ఊట్కూర్, జనవరి 19 : మండలంలోని పెద్దపొర్ల, మల్లెపల్లి గ్రామాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమబోర్డు నుంచి మంజూరైన ఆర్థికసాయాన్ని శుక్రవారం ప్రగతిశీల భవన నిర్మాణ సంఘం నాయకులు కనకరాయుడు, లింగప్ప అందజేశారు. కార్యక్రమంలో వార్డుసభ్యుడు పెద్దబాలకిష్టప్ప, అశోక్, రమేష్, వడ్లకృష్ణయ్య, పూజారి హన్మంతు, అయ్యప్ప, కార్మికులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

మక్తల్, జనవరి 19 : ఎస్ఎంసీ (పాఠశాల యాజమాన్య కమిటీ) ఎన్నికలు సజావుగా నిర్వహించాలని మక్తల్ విద్యాధికారి వెంకటయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని వనాయకుంట, గుర్లపల్లి ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో చేపడుతున్న జాలీఫోనిక్స్, ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకొని తగు సూచనలు చేశారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల షెడ్యూల్ వచ్చినందున తగు ఏర్పాట్లు చేసుకొని ఎన్నికలు సజావుగా నిర్వహించుకోవాలన్నారు.కార్యక్రమంలో సీఆర్‌పీ సునీత, వనాయకుంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సిములు, రాంగోపాల్, రిటైర్డ్ ఉపాధ్యాయులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికలను సమానంగా భావించాలి

మక్తల్, జనవరి 19 : బాలబాలికలను సమానంగా భావించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జండర్ స్పెషలిస్ట్ అనిత, బేటీ బచావో.. బేటీ పడావో మెంటర్ రేణుక అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో బాలబాలికలను వేర్వేరుగా చూడకుండా అందరిని సమానంగా చూడాలన్నారు. కాన్పు అయిన తర్వాత బిడ్డకు బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది నారాయణమ్మ, అనూష పాల్గొన్నారు.

చిన్నపొర్లలో వారం సంత ప్రారంభం

ఊట్కూర్, జనవరి 19 : మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో వారం సంతను శుక్రవారం గ్రామ సర్పంచ్ ఎం.రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చాలా గ్రామాల్లో సంతలు జరుగుతుండటంతో చిన్నపొర్ల గ్రామంలో శుక్రవారం సంతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి రోజు సంతలో కొనుగోలు చేయడానికి గ్రామస్థులు ఆసక్తి చూపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్, నాయకులు శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నా పట్టించుకోరా?

- స్థాయీ సంఘం సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు రఘుపతిరెడ్డి


స్థాయీ సంఘం సమావేశంలో నివేదికను చదువుతున్న అధికారులు

నారాయణపేట టౌన్, జనవరి 19: రేషన్ బియ్యాన్ని డీలర్లు స్వాహా చూస్తూ పక్కదారి పటిస్తున్నా పట్టించుకోరా అని జడ్పీటీసీ సభ్యుడు రఘుపతిరెడ్డి పౌర సరఫరాల శాఖ అధికారిని నిలదీశారు. శుక్రవారం జడ్పీ చైర్‌పర్సన్ వనజ అధ్యక్షతన రెండవ స్టాండింగ్ కమిటీ (గ్రామీణ, అభివృద్ధి), నాల్గవ స్టాండింగ్ కమిటీ (విద్య, వైద్య సేవలు) సమావేశాలు నిర్వహించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తే వారే అక్కడి నుంచి రైస్ మిల్లులకు తీసుకెళ్లారని, ట్రాన్స్‌పోర్ట్ బిల్లులు ఎవరికి చెల్లిస్తున్నారని పౌర సరఫరాల శాఖ అధికారిని జడ్పీటీసీ సభ్యుడు ప్రశ్నించారు. దాంతో సంబంధిత అధికారి బిల్లులను నిలిపివేస్తామన్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ హరితహారంలో భాగంగా నాటిన మొక్కలకు వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నీటిని పోసి కాపాడాలని డీఆర్డీఏ పీడీని ఆదేశించారు. పరిశ్రమల శాఖ వారు మండలాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పరిశ్రమలు స్థాపించడానికి యువతను ప్రోత్సహించాలని, మిగిలిపోయిన మిషన్ భగీరథ ట్యాంకులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్నం జరిగిన 4వ స్థాయీ సంఘం సమావేశంలో చైర్‌పర్సన్ కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలలో తాగునీరు, నాణ్యమైన భోజనం, సరిపడ టాయిలెట్స్ అందు బాటులో ఉంచాలని ఆదేశించారు. పీహెచ్‌సీల్లో మెడికల్ అధికారులు సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు సేవలు అందించాలని, ఓపీని పెంచాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు వందశాతం నిర్వహించాలని, పల్లె దవాఖానాల్లో ఫర్నిచర్, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశాల్లో జడ్పీటీసీ సభ్యులు వెంకటయ్య, రఘుపతిరెడ్డి, కోఆప్షన్ తాజుద్దిన్, జడ్పీ సీఈవో శైలజ, జ్యోతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. మూడవ స్థాయీ సంఘం వ్యవసాయం సమావేశం జడ్పీ వైస్ చైర్‌పర్సన్ సురేఖ అధ్యక్షతన, ఐదవస్థాయీ సమావేశం నర్వ జడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి అధ్యక్షతన కొన సాగాయి. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు అశోక్ కుమార్ పాల్గొన్నారు.

వృత్తిపట్ల నిబద్ధత కలిగి ఉండాలి

- ఎస్‌బీ సీఐ శ్రీకాంత్ రెడ్డి
- రిసెప్షన్ పోలీస్ అధికారులకు శిక్షణ


రిసెప్షన్ పోలీస్ అధికారులకు శిక్షణ ఇస్తున్న ఎస్‌బీ సీఐ శ్రీకాంత్‌రెడ్డి

నారాయణపేట, జనవరి 19: వృత్తిపట్ల నిబద్ధత కలిగి ఉండాలని ఎస్‌బీ సీఐ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. శుక్రవారం నారాయణపేట ఎస్పీ కార్యాలయంలోని శిక్షణ సెంటర్‌లో జిల్లాలోని వివిధ పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న రిసెప్షన్ పోలీస్ అధికారులకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌బీ సీఐ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రిసెప్షన్ అధికారులు వృత్తిపట్ల నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన, యూనిఫామ్ నీట్, టర్న్‌ఔట్ కల్గి ఉండాలని, పీఎస్‌కు సమాచారం, ఫిర్యాదు చేసేందుకు వచ్చేవారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అందరికీ ఒకేరకంగా న్యాయమందేలా చూడాలని సూచించారు. పోలీస్ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించాల న్నారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టంలో నమోదు చేయాలని, ఫిర్యాదు తీవ్రతను బట్టి వెంటనే స్పందించి ఎస్‌హెచ్‌వో, ఆపై ఉన్నతాఅధికారులకు, ఒర్టికల్ అధికారులకు సమాచారమందించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రిసెప్షన్ వద్ద, పరిసరాల్లో పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, రికార్డులను క్రమ పద్ధతిలో నిర్దేశిత ప్రదేశంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఐటీ కోర్ టీం శ్రీనివాసులు, రమేష్, శ్రీజ, కిరణ్, వివిధ పీఎస్‌లకు సంబంధించిన రిసెప్షన్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

శిఖం భూములు కబ్జా చేస్తే ఎలా?

- మాసులోనికుంటను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు


మాసులోనికుంటను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

కోస్గిరూరల్, జనవరి 19: మండలంలోని ముశ్రీఫా గ్రామ శివారులోని మాసులోని చెరువు కబ్జా చేయడంపై ఇరిగేషన్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఇరిగేషన్ డీఈ ఆనంద్ కిషోర్, రెవెన్యూ ఆర్ఐ లింగారెడ్డి ముశ్రీఫా శివారులోని సర్వే నెంబరు 183,184ను పరిశీలించారు. ప్రభుత్వ శిఖం భూమిని కబ్జాచేసి ఎక్స్‌కవేటర్‌తో చదునుచేసి పంటలు వేసుకుంటుంటే రెవెన్యూ అధికారులుగాని పంచాయతీ కార్యదర్శిగాని కనీస సమాచారం ఇవ్వకుంటే ఎలా అని ఇరిగేషన్ అధికారులు ప్రశ్నించారు. రెండు రోజులలో మొత్తం భూమి సర్వే చేయించి కబ్జాచేసినవారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, ఇందులో ఓ ఆర్మీ రిటైర్డ్ అధికారి వెంకటయ్యకు రెండు ఎకరాల భూమిని కేటాయించారని అధికారులు తెలిపారు. అయితే, ఆయన అట్టి భూమిని అమ్ముకునేందుకు ఎన్‌వోసీ తెచ్చుకున్నాడని అమ్మకానికి ఉంచాడని గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వ శిఖం భూమి అమ్మడానికి లేదని ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కిషోర్, వెంకట్రాములు, రైతులు పాల్గొన్నారు.

దేశం గర్వించే క్రీడాకారులుగా ఎదగాలి

- కాంగ్రెస్ నాయకుడు కొత్తకోట కార్తీక్‌రెడ్డి
- ఊట్కూర్‌లో యూసీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కొత్తకోట కార్తీక్‌రెడ్డి

ఊట్కూర్, జనవరి 19 : యువకులందరు ఆటపోటీల్లో రాణించి దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా ఎదగాలని కాంగ్రెస్ నాయకులు కొత్తకోట కార్తీక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కళాశాల మైదానంలో యూసీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడాపోటీల్లో పాల్గొనడం ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందన్నారు. అంతకుముందు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజ్ఞేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం క్రికెట్ ఆడి పోటీలను నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మణెమ్మ, మాజీ ఉపసర్పంచ్ ఖుర్షీద్, డాక్టర్ ఎల్కొటీ జనార్దన్‌రెడ్డి, పగిడిమారి మాజీ సర్పంచ్ బస్వరాజ్‌గౌడ్, ఓబ్లాపూర్ నాయకులు సత్యనారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, పగిడిమారి సత్యనారాయణగౌడ్, భీమ కవి, గాండ్లప్రశాంత్, దయ్యాల్ హుస్సేన్, రవికుమార్, యజ్ఞదత్తు, లింగం, నాగేష్‌గౌడ్, జలాల్, యువకులు పాల్గొన్నారు.

రేపు ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆటల పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వినయ్

మక్తల్, జనవరి 19 : నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వినయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 21న ఆదివారం ఉదయం 9గంటలకు మక్తల్ మినీ స్టేడియంలో పాఠశాల కళాశాల విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, బాలికలకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు జనవరి 23 నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని రోజు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. పట్టణంలోని పాఠశాల, కళాశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాల్సిందిగా కోరారు. ఈకార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి వంశీ, నాయకులు శరణ్, వినయ్, నిఖిల్, రాజులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే


ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, జనవరి 19 :హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం నియోజకవర్గ సమస్యలపై చర్చించగా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

రేపు విస్తృత స్థాయి సమావేశం

మక్తల్, జనవరి 19 : మక్తల్ పట్టణంలోని ద్వారక ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 21న కాంగ్రెస్ నియోజకవర్గస్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అధ్యక్షతన జరుగు సమావేశానికి మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంశీచందర్‌రెడ్డి హాజరవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి


మాగనూరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

మాగనూరు, జనవరి 19: అపరిచిత వ్యక్తుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని షీటీం ఏఎస్ఐ శ్రీదేవి అన్నారు. మాగనూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం షీటీం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గుడ్‌టచ్, బాడ్ టచ్ తదితర అంశాలపై ఆట,మాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు, పాఠశాల ప్రధానో పా. ద్యాయులు నర్సిములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దామరగిద్ద: ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ వెంకట్రాములుగౌడ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో పలు అంశాలపై పోలీసులు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు మత్తు పదార్థాలకు బానిసలు కారాదని, గంజాయి, డ్రగ్స్, మద్యం, ధూమపానం మొదలై వాటికి దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930, డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్ర మంలో పోలీసులు అనిల్, మొనప్ప పాల్గొన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

- జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలు

నారాయణపేట, జనవరి 19: నవోదయ 6వ తరగతి ప్రవేశ అర్హత పరీక్ష శనివారం జరుగనుంది. జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నారాయణపేట యాద్గీర్ రోడ్‌లోని గురుకుల పాఠశాలతో పాటు లిటిల్ స్టార్ పాఠశాలలో నవోదయ అర్హత ప్రవేశ పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకు జరుగనుంది. గురుకులాల్లో 312 మంది విద్యార్థులు, లిటిల్ స్టార్‌లో 302 మంది విద్యార్థులు మొత్తం 614 మంది విద్యార్థులు అర్హత పరీక్షకు హాజరు కానున్నారు. విద్యార్థులు హాల్‌టికెట్ పొంది గుర్తింపు కార్డు ఏదైనా తీసుకొని పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు తగిన ఏర్పాట్లను చేపట్టారు.

జోరుగా ధాన్యం విక్రయాలు

నారాయణపేట, జనవరి 19: నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం ధాన్యం విక్రయాల జోరుగా కొనసాగింది. పెసళ్లు ఒక క్వింటాళ్లు విక్రయానికి రాగా క్వింటాల్ గరిష్ఠ ధర రూ.7,200, కనిష్ఠధర రూ.7,200, రమారమి ధర రూ.7,200, వేరు శనగలు 442 క్వింటాళ్లు విక్రయానికి రాగా గరిష్ఠ ధర రూ.7,351, కనిష్ఠ ధర రూ.4,209, రమారమి ధర రూ.5,179, అలసందలు 14 క్వింటాళ్లు విక్రయానికి రాగా గరిష్ఠ ధర రూ.7,311, కనిష్ఠ ధర రూ.5,801, రమారమి ధర రూ.7,211, సోనా 42 క్వింటాళ్లు విక్రయానికి రాగా గరిష్ఠ, కనిష్ఠ, రమారమి ధరలు రూ.2,612, ఎర్ర కందులు 541 క్వింటాళ్ళు విక్రయానికి రాగా క్వింటాల్ గరిష్ఠ ధర రూ.10,655, కనిష్ఠ ధర రూ.9,009, రమారమిగా రూ.10,241, తెల్లకందులు 82 క్వింటాళ్లు విక్రయానికి రాగా గరిష్ఠ ధర రూ.10,720, కనిష్ఠ ధర రూ.9,400, రమారమిగా రూ.10,150 పలికింది.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా జలంధర్‌రెడ్డి


జలంధర్‌రెడ్డి

నారాయణపేట, జనవరి 19: బీజేపీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడిగా మాదిరెడ్డి జలంధర్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ ఎన్నికలు, పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా జిల్లా నూతన అధ్యక్షుడిని పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా నియమించడం పట్ల పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతలను వమ్ము చేయకుండా పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు తన వంతు కృషి చేస్తామన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నారాయణపేట, జనవరి 19: ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల అసోసియేషన్, జిల్లా శాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం డీఐఈవో రియాజ్ హుస్సేన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మద్దిలేటి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ముజీబ్, రియాజుద్దిన్, ప్రిన్సిపాళ్లు ప్రతాప్‌రెడ్డి, సుదర్శన్‌రావు, మురళీధర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

హెచ్ఐవీ, టీబీ వ్యాధులపై అవగాహన

మద్దూర్, జనవరి 19: హెచ్ఐవీ, టీబీ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని సూపర్‌వైజర్ కృష్ణ సూచించారు. శుక్రవారం మండంలోని రెనివట్లలో పలురకాల వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు వైద్య పరీక్షలు చేయించకోవాలని సూచించారు. హెచ్ఐవీ కలిగిన వారి పట్ల వివక్ష చూపరాదన్నారు. కార్యక్రమంలో డీఆర్పీ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, గ్రా మాధికారులు, యువకులు పాల్గొన్నారు.

22న మందిపల్లిలో సీతారాముల దేవాలయం ప్రారంభం

ధన్వాడ, జనవరి 19: ధన్వాడ మండలం మందిపల్లి గ్రామంలో ఈనెల 22న సీతారాముల దేవాలయాన్ని ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దాతల సహకారంతో గ్రామంలో సీతారాముల దేవాలయ నిర్మాణం చేపట్టారు. శనివారం నుంచి మూడురోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఈనెల 20న గణపతి పూజ, దీపారాధన, యాగశాల ప్రవేశం, జలాదివాసం, అగ్ని ప్రతిష్ఠా, మంగళహారతి, 21న ప్రాంతఃకాల పూజ, సామూహిక హోమాలు, ఉత్సవమూర్తుల ఊరేగింపు, 22న ప్రాతఃకాల పూజ, విగ్రహం ప్రతిష్ఠ, కామధేను దర్శనం, పూర్ణాహుతి, ప్రథమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఇథనాల్ ఇంధనంపై సెమినార్

ధన్వాడ, జనవరి19: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ఆహార పంటలతో పాటు ఇథనాల్ ఇంధనం, సాధ్యత, సుస్థిరత, శాస్త్రీయతపై సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట సమితి నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ జి. హరగోపాల్ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు. విధిగా అందరు పాల్గొని సెమినార్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఉదయం నుంచి సాయంత్రం జరిగే కార్యక్రమంలో ఇథనాల్ వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

కొండాపూర్‌లో ప్రభుత్వ స్థలం చదును

ధన్వాడ, జనవరి 19: ధన్వాడ మండలం కొండాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూమిని శుక్రవారం రెవెన్యూ అధికారులు చదును చేయించారు. త్వరలో పేదలకు ఇళ్ల స్థలాలుగా పంచనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో గిర్దావర్ మల్లేష్, సర్పంచ్ చంద్రకళ, బీఆర్ఎస్ నాయకులు అంజియాదవ్, పలువురు పాల్గొన్నారు.

'వర్గీకరణపై కమిటీ వేయడం సరికాదు'

నారాయణపేట టౌన్, జనవరి 19: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ ఆధ్వర్యంలో ఐదుమందితో కమిటీ వేయడం సరికాదని జాతీయ మాలల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గ్యాంగ్ హన్మంతు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ చెల్లదని సుప్రీం కోర్టు 15 ఏళ్ల క్రితమే స్పష్టం చేసిందని, ఉషా మెహరా కమిటీ సైతం వర్గీకరణ సాధ్యం కాదని చెప్పిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలుకుతుందని, రానున్న పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకి మాలలు తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. ఇకనైనా రాష్ట్రంలోని మాలలు ఏకమై వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసర ముందని ఆయన పిలుపునిచ్చారు.

వరిపైరులో జాగ్రత్తలు తీసుకోవాలి

మాగనూరు, జనవరి 19: మండలంలో చాలా గ్రామాల్లో రైతులు సాగు చేసుకుంటున్న వరిపైరు ఎదుగుదల లేక పొలాలు అక్కడక్కడ పంట ఎండిపోతుందని మాగనూరు ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ దృష్టికి రైతులు తీసుకెళ్లగా ఆయా గ్రామాలకు సంబంధించిన ఏఈవోలను గ్రామాల వారిగా పంట నమోదు కార్యక్రమం వారిపై మెళకువలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటి గురించి రైతులకు ఏఈవోలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.